

భారంగా జేపీ దర్గా టెండర్!

- రూ.4కోట్ల టెండర్‌కు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఈ నెల 17న రీ టెండర్
- అధిక టెండర్‌తో భక్తులపై ఆర్థిక భారం

6

కలెక్టరేట్‌లో నేడు పెన్షన్ అదాలత్

రంగారెడ్డి అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో ఈనెల 16న పెన్షన్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పెన్షనర్లు, పెన్షన్ అసోసియేషన్ వారు సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి డిప్యూటీ ఆడిట్ జనరల్ సిబ్బంది విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఈ అదాలత్‌లో జీపీఎఫ్ కేసులకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే వర్క్‌షాప్‌లో పెన్షన్స్, జీపీఎఫ్ అకౌంట్స్ సమస్యలపై, జీపీఎఫ్ ఫైనల్ చెల్లింపుల గురించి వివరిస్తారని తెలిపారు. జిల్లాకు సంబంధించిన డీడీవోలు, అకౌంట్స్ ఆఫీసర్లు సదస్సుకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



అందాలభామల కోసం ఎకో పార్కులో ఏర్పాట్లు

నేడు శంకర్‌పల్లిలో సందడి చేయనున్న సుందరాంగులు

- అంతర్జాతీయ వృక్షాలు, శిల్పకళను తిలకించనున్న బ్యూటీస్
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు

శంకర్‌పల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరుకు నేడు అపరంజి బొమ్మలు రానున్నారు. మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనే 22 దేశాలకు చెందిన సుందరాంగులు శుక్రవారం ఎక్స్‌పీరియం ఎకో- ఫ్రెండ్లీ పార్కులో సందర్శించి సందడి చేయనున్నారు. ఏకో పార్కులో 85 దేశాల నుంచి సేకరించిన అంతర్జాతీయ వృక్షాలతోపాటు శిల్పకళా సంపదను తిలకించనున్నారు. 25వేల అరుదైన మొక్కలతో అలరిస్తున్న ఎక్స్‌పీరియంకు శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఏకో పార్కులో గడపనున్నారు. ప్రకృతి ప్రేమికుడైన రాందేవ్‌రావు ప్రపంచ ప్రమాణాలతో

మిగతా 7వ పేజీలో...



పార్కులో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఫ్లెక్సీ రగడ

పరస్పరం ఫిర్యాదు చేసుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు




కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, మే 15(ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలో ఎమ్మెల్యే సబితా రెడ్డి పాల్గొన్న కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్, ఫ్లెక్సీల రగడతో గందరగోళ పరిస్థితి తలెత్తింది. ఎమ్మెల్యే సబితకు స్వాగతం పలుకుతూ కొందరు అభిమానులు మండల పరిషత్ వద్ద బీఆర్ఎస్ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు సమావేశంలోకి వెళ్లి.. 'ఇది బీఆర్ఎస్ పార్టీ మీటింగా?' అని తహసీల్దార్, సీఐలను నిలదీశారు. పట్టుదలకు పోయిన కాంగ్రెస్ నాయకులు.. పార్టీ జెండాలను కార్యాలయ గేటు ఎదుట పెట్టడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. బీఆర్ఎస్ ఫ్లెక్సీని కొందరు కాంగ్రెస్ నాయకులు చింపేశారు. దీంతో నాయకుల మధ్య వాదులాట, తోపులాట జరిగింది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొని నాయకులకు సర్దిజెప్పారు. అనంతరం మండల పరిషత్ హాలులో ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... ప్రజలకు మేలుచేసే కార్యక్రమాల్లో రాజకీయాలు చేయకూడదని అన్నారు. పది సంవత్సరాలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన కల్యాణలక్ష్మి పథకం అమలవుతోందని, అయితే కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీల్లో భాగంగా తులం బంగారం ఎప్పుడిస్తారని అడగడం తప్పా? అని సబితారెడ్డి అన్నారు. దీనికి ప్రతిగా ఏఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్లు కృష్ణానాయక్, యాదయ్యలు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూపంపిణీ, నిరుద్యోగ భృతి, దళితబంధు వంటి హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ ముదిరింది. వారు పరస్పరం పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు.



కాంగ్రెస్ నాయకులు చింపేసిన బీఆర్ఎస్ నాయకుల ఫ్లెక్సీ



కేంద్రం ఇటీవల విడుదల చేసిన సీఆర్ఎస్-2021 నివేదిక తప్పుల తడకగా ఉంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జనన, మరణాలకు సంబంధించిన సమగ్ర వివరాలలో ఎన్నో లోపాలు వెలుగు చూశాయి. వికారాబాద్ జిల్లా కంటే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో జనాభా ఎక్కువగా ఉంటుంది. ఈ సంఖ్య ఆధారంగానే జనన మరణాలు కూడా ఉంటాయి. కానీ కేంద్రం ఇచ్చిన నివేదికలో వాస్తవానికి భిన్నంగా వివరాలు ఉన్నాయి. అంతేకాకుండా నివేదికలో రంగారెడ్డి జిల్లా పేరు శంషాబాద్- రంగారెడ్డి జిల్లాగా ఉంది. కొత్త జిల్లాలు ఏర్పాటై దాదాపు తొమ్మిదేళ్లు గడిచినా పేర్లపై ఇంకా అయోమయం నెలకొనడం గమనార్హం.

- వికారాబాద్ జిల్లా కంటే రంగారెడ్డిలో జనన, మరణాలు తక్కువ
- రంగారెడ్డి జిల్లాలో గర్భస్థ శిశు మరణాలు నిల్
- వికారాబాద్‌లో శిశు మరణాలు లేవు.. వాస్తవాలకు దూరంగా వివరాలు

తప్పుల తడక!

సీఆర్ఎస్ నివేదికలో లోపాలెన్నో..



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

జనన మరణాలకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) 2021 నివేదిక లోపాలపుట్టగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లో మరణ, జననాలకు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన సీఆర్ఎస్-2021 నివేదికను కేంద్రం ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో శిశు మరణాలు, గర్భస్థ మరణాల వివరాలను సైతం వెల్లడించింది. అయితే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివరాలపై గందరగోళం నెలకొంది. రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లా

మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లా వివరాలు

	జననాలు			మరణాలు		
జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం	పురుషులు	మహిళలు	మొత్తం
రంగారెడ్డి	4,418	4,077	8,495	3,763	2687	6,450
మేడ్చల్	18,393	17,031	35,424	2,509	1,912	4,421
వికారాబాద్	11,493	10,718	22,211	4,170	2,942	7,112

తడిసిన ధాన్యాన్నీ కొనాల్సిందే



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బాబయ్య

షాద్‌నగర్ అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య డిమాండ్ చేశారు. వర్షంతో షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన మొక్కజొన్న, వడ్లను గురువారం పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన పరిశీలించారు. భారీ వర్షం, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంతో జరిగిన నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ఎరువుల సబ్సిడీలు పెంచి, ప్రోత్సాహకాలిస్తూ రైతులను ఆదుకుంటుంటే, రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో విఫలమైందన్నారు. షాద్‌నగర్ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో వడ్లు సరిగ్గా కొనడం లేదని రైతులు వ్యాపారులకు అమ్ముకుంటూ ధరలో నష్టపోతున్నారని తెలిపారు. సన్న వడ్లకు 2,320, రూ.500 బోనస్, దొడ్డు వడ్లకు 2,300 మద్దతు ధరను కేంద్రం ప్రకటించిందన్నారు. కేంద్రాల్లో కొర్రీలు పెడుతూ ధాన్యం కొనడంలేదని, రైతులు బయట రూ.1,800కు అమ్మి నష్టపోతున్నారని తెలిపారు. యార్డుకు వచ్చిన ధాన్యం తడిసిపోతే అధికారులుగానీ, నేతలు గానీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా తడిసిన ధాన్యాన్ని, అలాగే రైతులు తెస్తున్న ప్రతీ గింజను ప్రభుత్వమే కొనాలని బాబయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.మురళి, వంశీకృష్ణ, అశోక్, రుషికేశ్, హరిభూషణ్, కుర్మయ్య, ప్రశాంత్, శివశంకర్, నర్సింహ పాల్గొన్నారు.

అవయవ దానంతో అమరుడైన రాజు

కేశంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): తాను చనిపోతున్నా ఎనిమిది మందికి అవయవదానం చేసి అమరజీవిగా నిలిచాడు మున్నూరు రాజు.. తాను ఎలాగూ బతకనని, తన అవయవయాలు ఎవరికైనా అవసరమైతే దానం చేయాలని కుటుంబీకులకు చెప్పి కన్ను మూశాడు రాజు. అతడి చివరి కోరికను కుటుంబ సభ్యులు తీర్చారు. ఫరూఖ్‌నగర్ మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మున్నూరు రాజు (49) ఈనెల 10న రాత్రి సమయంలో తన స్వగ్రామం వెళ్తుండగా వస్తున్న కారు ఢీకొంది. తీవ్ర గాయాలైన రాజును వారి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గ్లోబల్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు రాజుకు పరీక్షలు నిర్వహించి మెదడుకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. బుధవారం మధ్యాహ్న సమయంలో రాజు తుదిశ్వాస విడిచాడు. అతడి కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు మృతదేహంలోని కీలకమైన 8 అవయవాలను గ్లోబల్ ఆస్పత్రి వైద్య విభాగం సేకరించారని రాజు కుటుంబీకులు గురువారం తెలిపారు.

తల్లిదండ్రులు.. ప్రత్యక్ష దైవాలు

తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు



- అట్టహాసంగా పాదపూజ కార్యక్రమం

ఆమనగల్లు, మే15(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని గురువారం తల్లిదండ్రులకు పాద పూజ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించాంచారు. ఆమనగల్లు సాయిరామ్ మెడికల్ హాల్ , ఆప్టికల్స్ సహకారంతో శృతిలయ కల్చరల్ అకాడమి, వందేమాతరం పౌండేషన్, మై విలేజ్ మోడల్ విలేజ్ పౌండేషన్ ల ఆధ్వర్యంలో స్థానిక వివేకా విద్యా భారతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల సంస్కారాన్ని, తల్లిదండ్రుల పట్ల ఉన్న గౌరవాన్ని చాటింది. వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎద్మ మాధవరెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 350మంది విద్యార్థులు తల్లిదండ్రులకు పాద పూజ చేశారు. ఈసందర్భంగా శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్ బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు అలరించాయి. ప్రముఖ యోగా గురూజీ రమేశ్ యోగాసనాలు చేపట్టారు. కార్యక్రమంలో మహమూద్, గోలి శ్రీనివాస్, శంకర్, ఉమాపతి, పాపిశెట్టి శ్వేత, శ్రీశైలం, వసంత, కవిత, శ్యామల, నాగార్జున, దీపక్, గోపి, జంగయ్య, అనిత, పల్లవి, ఉదయ్‌కుమార్, అశోక్, సాయి చరణ్, రాహుల్, జాఫర్ పాల్గొన్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

షాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి) : వైద్యులు సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. మండలంలోని చందన్‌వెళ్లి, షాబాద్ పీహెచ్‌సీలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు. డీఎంహెచ్‌వో రాకను తెలుసుకొని హైతాబాద్, నాగర్‌గూడ, షాబాద్‌లోని ఆర్ఎంపీ వైద్యులు క్లినిక్‌లను మూసివేశారు.

భారంగా జేపీ దర్గా టెండర్!

- గత రూ.4కోట్ల టెండర్‌కు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఈ నెల 17న రీ టెండర్
- అధిక టెండర్‌తో భక్తులపై ఆర్థిక భారం


హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా

కొత్తూర్, మే 15(ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా భక్తులు విశ్వసించే హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా టెండర్‌కు ఈసారైనా మోక్షం లభిస్తుందా? అనే ప్రశ్న వ్యాపారవర్గాల్లో మొదలైంది. ఇన్ముల్‌నర్వలో జేపీ దర్గా ఉంది. ఈ దర్గాకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. యేటా కోట్లాది రుపాయలు వెచ్చించి కాంట్రాక్టర్లు నిర్వహణ, పూజల నిర్వహణ హక్కులను దక్కించుకుంటున్నారు. టెండర్ పూర్తయి నాలుగు నెలలైనా రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ప్రక్రియను పూర్తి చేయలేదు. జేపీ దర్గా టెండర్‌ను రూ.4కోట్లకు నిర్ణయిస్తూ రెండు నెలల వక్ఫ్‌బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. ధర ఎక్కువ కావడంతో ఒక్కరూ టెండర్‌కు వేయలేదు. దీంతో పోస్ట్‌పోన్ చేశారు. టెండర్ రేట్‌ను అధికారులు యేటా పెంచుతుండడంతో హక్కులు దక్కించుకున్న కాంట్రాక్టర్ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. దీంతో భక్తుల రాకా తగ్గుతోంది. వక్ఫ్ బోర్డు తన ఆదాయాన్ని పెంచుకునేందుకే చూస్తోందే తప్ప భక్తులకు కలుగుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రూ.లక్షల్లో పలికిన దర్గా టెండర్ నేడు కోట్లకు పెంచడంతో పెట్టిన డబ్బుకు రెట్టింపు వసూలు చేసేందుకు కాంట్రాక్టర్లు దర్గా వద్ద వాడే వస్తువుల, ధార్మిక కార్యక్రమాల నిర్వహణ రేట్లను భారీగా పెంచుతున్నారు. ఆర్థిక భారం పడుతుందనే దర్గాకు భక్తుల తాకిడి తగ్గుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో రాష్ట్రం నలుమూలల నుంచే గాక పక్క రాష్ట్రాల నుంచీ భక్తులొచ్చేవారు. కారణం ఏదైనా ఇప్పుడు దర్గాకు భక్తుల రాక తగ్గి వెలవెలబోతోంది.

కోర్టును ఆశ్రయించిన ముజావర్లు

జేపీ దర్గాలో ఏర్పాటు చేసిన 14 హుండీలు తమకే దక్కుతాయని, వక్ఫ్‌బోర్డు కాంట్రాక్టార్లకు కేటాయించడం సరికాదని దర్గా ముజావర్లు కోర్టును ఆశ్రయించారు. తాత,ముత్తాతల నుంచీ హుండీలు ముజావర్లకే ఇచ్చే వారని, వాటిని కాంట్రాక్టర్‌కు ఎలా ఇస్తారని వారు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో రేపు(17న) టెండర్‌కు కాల్‌ఫర్ చేస్తున్నట్టు వక్ఫ్‌బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు నెలల క్రితం ఏడాది కాలానికి రూ.4కోట్లు నిర్ణయి స్తూ నోటిఫికేషన్ జారీచేస్తే ఒక్కటీ దాఖలుకాలేదు. అలాగే హుండీ ఆదాయాలు తమకే ఇవ్వాలని ముజావర్లు కోర్టును ఆశ్రయించారు. దీంతో వక్ఫ్‌బోర్డు హుండీలను పక్కనబెట్టి మేక చర్మం, తలలు, కాళ్లు, కేశ ఖండనం, నీటి బిల్లు, లైబజార్, చెప్పుల స్టాండ్, లడ్డూ కౌంటర్, గిలాఫ్ చాదర్, పోస్టాఫీసు ఆదాయం, బంగారు, వెండి వస్తువుల సమర్పణ, కొబ్బరికాయలు తదితర 15రకాల వస్తువుల అమ్మకాల హక్కులకు తాజాగా 2.75కోట్లతో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది.

భక్తుల నిలువు దోపిడీ

టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్లు భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. కాంట్రాక్టర్ టెండర్ డబ్బు రికవరీ కోసం భక్తుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. కొన్నిసార్లు కాంట్రాక్ట్ సిబ్బంది, వ్యాపారులు భక్తులపై దాడులకు సైతం పాల్పడుతున్నారు. వ్యాపారులపై కేసులూ నమోదయ్యాయి.

వక్ఫ్ బోర్డుకు ఆదాయమే ముఖ్యం



తమకు వచ్చే ఆదాయం పైనే వక్ఫ్‌బోర్డు పెద్దలు, అధికారులు దృష్టి పెడుతున్నారు. భక్తులకు కల్పించాల్సిన వసతులపై, కలుగుతున్న ఇబ్బందులను మాత్రం వారు పట్టించుకోవడం లేదు. దర్గాలో 'నియాజ్' చేయాలంటే భక్తులకు తలకుమించిన భారంగా మారింది. ప్రతీ దానికి భారీగా డబ్బు వసూలు చేస్తున్నారు. పేద భక్తులు భరించలేని విధంగా రేట్లు పెంచుతున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

- ఆగిర్ రవికుమార్‌గుప్తా, ఇన్ముల్‌నర్వ

టెండర్ ధర తగ్గించాలి



జేపీ దర్గా టెండర్ ధరను తగ్గించాలి. ప్రతి సంవత్సరం రేట్లు పెంచుతుండడంతో కాంట్రాక్టర్ భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. టెండర్ పేరుజెప్పి జబర్‌దస్తీగా డబ్బు వసూలు చేస్తున్నారు. ఇది భక్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మొక్కులు తీర్చుకోవాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. దాంతో దర్గాకు భక్తుల రాక తగ్గింది.

- లింగంనాయక్, ఇన్ముల్‌నర్వ

కూల్ రూఫ్ పాలసీ అమలేది?

- స్క్వేర్ మీటర్‌కు రూ.300 వరకు ఖర్చు
- కూల్ రూఫ్ పెయింట్ వేయకున్నా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ!
- నిబంధనలు పాటించని అధికారులు



తాండూరు, మే 15(ఆంధ్రజ్యోతి): భవన సముదాయ, భవన నిర్మాణంలో కూల్ రూఫ్ పెయింట్ తప్పని సరి. ఇది భవిష్యత్తు తరాల కోసం తెచ్చిన పాలసీ అని చెప్పొచ్చు. భవనాలపై కూల్ రూఫ్ పెయింట్ వేస్తే సదరు భవన పరిసరాల్లో 4 నుంచి 16 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత తగ్గుతుంది. పర్యావరణ మార్పులు వేడి, తేమను తీవ్రతరం చేస్తున్న తరుణంలో ఆర్సీసీతో వేసే ప్రతీ ఇంటికి 'కూల్ రూఫ్' పెయింట్ అవసరం. ఇది ఐదేళ్ల పాలసీగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ-2023లో ప్రారంభించింది. 2028 వరకు ఈ పాలసీని పట్టణాల్లో అమలు చేస్తారు. అయితే ప్రచార లోపంతో ఈ పాలసీ అమలు కావడంలేదు.

పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

కూల్ రూఫ్ పాలసీ అమలు బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులదే. టీజీ-బీపాస్ అమలు చేస్తున్న అధికారులే దీని అమలుకూ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించాలి. జిల్లాలో నాలుగు పట్టణాలుండగా ఎక్కడా ఈ పాలసీ అమలు కావడం లేదు. జిల్లాలో పెద్ద మున్సిపాలిటీ, వాణిజ్య కేంద్రంగా రూపుదిద్దుకున్న తాండూరులో ఒక్క కూల్ రూఫ్ కూలి ంగ్ పెయింట్ వేసిన బిల్డింగ్ కూడా లేదు. ప్రభుత్వ, కమర్షియల్ భవనాలకు ఈ విధానం తప్పనిసరి. 600 చదరపు గజాలకు మించి ఉన్న అన్ని నిర్మాణాలకు కూల్ రూఫింగ్ వేయాలి. ఇందిరమ్మ ఇళ్లకు సైతం ఈ రూఫ్ పెయింట్ నిబంధన పెట్టారు. కూల్ రూఫ్ పెయింట్ ఉంటేనే మున్సిపల్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓఆర్) జారీ చేయాలనే నిబంధనా ఉంది.

అమలుపై అడుగడుగునా నిర్లక్ష్యం

కూల్ రూఫ్ పాలసీని అమలు చేస్తే విద్యుత్ వినియోగమూ తగ్గుతుంది. తాండూరులో 19,500 వరకు నివాసాలు, వాణిజ్య సముదాయలున్నాయి. కూల్ రూఫింగ్‌తో వాతావరణంలో వేడి పెరగకుండా ఏసీలు, కూలర్లు తదితరాల వాడకం తగ్గి విద్యుత్ వినియోగం తగ్గుతుంది. విద్యుత్ ఆదా అవడంతో పాటు ఉష్ణోగ్రతలూ తగ్గుతాయి. అలాగే ఇళ్ల పైకప్పులు ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ పాలసీ ఉద్దేశ్యం మంచిదే కానీ అమలుపై ఇళ్ల యజమానుల, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆర్సీసీ నిర్మాణాల్లో వేడి పెరుగుతోంది.

చికెన్ బిర్యానీలో బల్లి!

- అవాక్కైన కస్టమర్.. పోలీసులకు ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సాగర్ రోడ్డులో ఉన్న ఓ రెస్టారెంట్‌లో చికెన్ బిర్యానీలో బల్లి వచ్చిందని గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణంలో గల మెహిఫిల్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో గుజ్జ కృష్ణారెడ్డి అనే కస్టమర్ చికెన్ బిర్యానీకి ఆర్డర్ చేశారు. వెయిటర్ తెచ్చిన బిర్యానీలో బల్లి ఉన్నట్టు గుర్తించి అవాక్కయ్యాడు. వెంటనే ఆయన రెస్టారెంట్ యాజమాన్యాన్ని నిలదీశాడు. అనంతరం మున్సిపల్ అధికారులకు కృష్ణారెడ్డి సమాచారమిచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో మున్సిపల్ అధికారులు ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచామిచ్చారు. దాంతో యాజమాన్యం ముందస్తుగా రెస్టారెంట్‌ను మూసివేసింది. నేడు(శుక్రవారం) ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించనున్నారు.


చికెన్ బిర్యానీలో వచ్చిన బల్లి

హెచ్‌ఆర్సీని ఆశ్రయించిన సీనియర్ సిటిజన్

- భార్య, కుమారులు తనను చూడటం లేదని ఫిర్యాదు

కీసర, మే 15(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్య, ఇద్దరు కొడుకులు ఇంటి తనను నుంచి వెళ్లగొట్టారని ఓ సీనియర్ సిటిజన్ రాష్ట్ర మానవ హక్కుల సంఘాన్ని(హెచ్‌ఆర్సీ) ఆశ్రయించిన ఘటన మేడ్చల్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నాచారం మల్లాపూర్‌నకు చెందిన షార్వాలే నర్సింగ్‌రావును భార్య, ఇద్దరు కూమారులు కొన్నాళ్లుగా వేధిస్తున్నారు. బూతులు తిడుతున్నారు. తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని నర్సింగ్‌రావు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే రూ.60వేల అద్దె వస్తున్నా తనకు రూపాయి కూడా ఇవ్వడం లేదని అతడు హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. దీంతో సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమం చట్టం-2007 ప్రకారం కేసును పరిగణలోకి తీసుకున్న హెచ్‌ఆర్సీ కేసును విచారించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశించింది. కేసును దర్యాప్తు చేసి, పరిష్కారం కోసం సంబంధిత అధికారికి సూచించాలని హెచ్‌ఆర్సీ కలెక్టర్‌కు సూచించింది. అలాగే దీనిపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జూన్ 30వ తేదీలోగా కమిషన్‌కు అందజేయాలని బుధవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మేడ్చల్ కలెక్టర్‌ను ఆదేశించింది.

బ్యాడ్మింటన్ విజేత సాత్విక్ జోడీ



పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ మే 15, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను హైదరాబాద్ షట్లర్ కె.సాత్విక్‌రెడ్డి జోడీ కైవసం చేసుకుంది. గురువారం మొయినాబాద్‌లోని గుత్తాజ్వాల అకాడమీలో జరిగిన ఫైనల్‌లో సాత్విక్-రాధిక శర్మ(పంజాబ్) జంట 21-15, 21-10తో నితిన్‌కుమార్(ఢిల్లీ)-రితిక(మహారాష్ట్ర) జోడీపై నెగ్గింది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ క్రాంతి, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కోశాధికారి వంశీధర్ పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పథకాలు సక్రమంగా అమలయ్యేలా పని చేయాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

- సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

వికారాబాద్, మే15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలయ్యేలా అధికారులు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లతో కలిసి వివిధ శాఖల పనితీరు, అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపైన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఒక శాతం ఉన్న ఉద్యోగులు 99 శాతం ఉన్న ప్రజల కోసం సమర్థవంతంగా పనిచేస్తూ మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. రైతులు సన్న రకం ధాన్యాన్ని పండించే రైతులకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించడం జరుగుతోందన్నారు. అన్ని కుటుంబాలకు పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన రాజీవ్ యువ వికాసం పథకం యూనిట్లకు అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. జిల్లాలో రైతు భరోసా, రుణమాఫీ పథకం అమలు వివరాల గురించి జిల్లా వ్యవసాయాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని, విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందించేలా అధికారులు ముందుకు సాగాలన్నారు. ప్రజలకు ఆరోగ్యాన్ని పంచే విధంగా పారిశుద్ధ్యం పనులను సమర్థవంతంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు భూభారతి చట్టం అమల్లోకి తీసుకువచ్చిందని, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు అంకిత భావంతో పనిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సన్న బియ్యం ఎలా ఉన్నాయి?
రేషన్ దుకాణం తనిఖీ చేసిన సీఎస్..

ఇదిలా ఉంటే, కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించిన అనంతరం సీఎస్ రామకృష్ణారావు వికారాబాద్‌లో వెంకటేశ్వర కాలనీలో రేషన్ దుకాణం(షాప్ నంబర్ 54)ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యం ఎలా ఉన్నాయంటూ బియ్యం తీసుకునేందుకు వచ్చిన కార్డుదారులను సీఎస్ ప్రశ్నించగా.. బియ్యం బాగున్నాయని, అన్నం బాగానే అవుతోందని వారు చెప్పారు. సన్నబియ్యానికి లబ్దిదారుల నుంచి స్పందన ఎలా ఉందంటూ డీలర్ అనితను అడిగారు. రేషన్ కార్డుదారులంతా బియ్యం తీసుకు వెళుతున్నారంటూ ఆమె సీఎస్‌కు చెప్పారు.

అధ్యాపకురాలికి గణితంలో డాక్టరేట్


ప్రొఫెసర్ శంకర్ నుంచి పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న పుష్పలత

శామీర్‌పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సమస్యలను అధిగమించి చదవి ఉద్యోగం సాధించిన ఓ అధ్యాపకురాలు ఉస్మానియా విశ్వవిద్యాలయ డాక్టరేట్ సాధించారు. లాల్‌గడి మలక్‌పేటకు చెందిన కత్తి యాదగిరి భార్య పుష్పలత 2019 నుంచి సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం షేరుపల్లి బందారం గ్రామానికి చెందిన చిన్న బాలయ్య-బాలవ్వ దంపతుల కుమార్తె పుష్పలత. 2022లో యాదగిరితో వివాహమైంది. పుష్పలత గణితంలో 'న్యూ మరికల్ స్టడీ ఆఫ్ ఎంహెచ్‌డీ, నాన్ న్యూటేనియస్ నానో ఫ్లూయిడ్స్' అనే అంశంపై ప్రొఫెసర్ శంకర్ పర్యవేక్షణలో ఓయూ గణిత విభాగంలో పరిశోధన చేశారు. పుష్పలతకు గురువారం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆమె టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీఎడ్ విద్య నుంచి గణితంలో ప్రతిభ చూపారు. ఓయూలో పీజీ, గణితంలో ఆరేళ్లు పీహెచ్‌డీ చేశారు. ఆమెకు పీహెచ్‌డీలో డాక్టరేట్ పట్టాను ఓయూ ప్రొఫెసర్ శంకర్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించినందుకుగాను అధ్యాపకురాలు పుష్పలతను గురువారం కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు

బషీరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు రైతులను నిత్యం వెంటాడుతున్నాయి. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసింది. తూకాల జాప్యంతో పడిగాపులు కాస్తున్న రైతులకు వర్షం ఇబ్బందులకు గురి చేస్తోంది. మండలంలోని మైల్వార్, బషీరాబాద్, దామర్‌చెడ్, కాశీంపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం వర్షార్పణం కావడం పట్ల రైతులు తల్లడిల్లిపోతున్నారు. కేంద్రాల వద్ద టార్ఫలిన్లతో నిండుగా కప్పినా ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓ పక్క హమాలీల కొరతతో తూకాలు సక్రమంగా జరుగక రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. అధికారులు తూకాలను వేగవంతం చేయాలని కోరుతున్నారు.


బషీరాబాద్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



ధాన్యం కొనకపోవడంతో నిరసనకు దిగిన రైతులు


మేడ్చల్ సహకార సంఘం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మేడ్చల్ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పండించిన పంటను అమ్మేందుకు వస్తే కొనకుండా వెనక్కు పంపుతున్నారని ఆగ్రహంతో మేడ్చల్ రైతులు గురువారం రైతు సహకార సంఘం వద్ద నిరసనకు దిగారు. పండిన వడ్లను ధ్యాన్యం కొనుగోలు కేంద్రానికి తెస్తే కొనం అని అధికారులు వెనక్కి పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనతో అధికారులు సొసైటీ వద్దకు చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా రైతులు వినకుండా తమ నిరసనను కొనసాగించారు. వ్యవసాయ శాఖ అధికారి అర్చన చేరుకుని రైతులతో మాట్లాడి వారిని శాంతింపజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... అకాల వర్షాల కారణంగా పండించిన పంటలను భద్రపర్చలేని దయనీయ స్థితిలో ఉన్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్ల ప్రారంభించాలని సొసైటీ అధికారుల చుట్టూ 15రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. వడ్లకు గిట్టుబాటు ధర చెల్లించి కొంటామంటూ ఓ వైపు ప్రభుత్వం పేర్కొంటున్నా సొసైటీలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు వాపోయారు. సొసైటీలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించకుంటే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. వారితో ఏవో అధికారి అర్చన మాట్లాడుతూ.. వడ్లలో తాలు, చెత్త, మట్టి లేకుండా తీసుకురావాలని కోరారు. వడ్లలో తాలు ఎక్కువ ఉండటంతో మిల్లరు తీసుకోక ఇబ్బందులు కులగుతున్నాయని తెలిపారు. రైతులకు రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం అమ్ముకునే వీలు కల్పిస్తామన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా వెంటనే చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం అక్కడికి చేరుకున్న సహకార సంఘం ఛైర్మన్ రణదీప్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డిలు రైతులను సముదాయించారు. దీంతో రైతులు తమ నిరసన విరమించారు.

ఫైళ్ల క్లియరెన్స్‌కు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారు

» నేను మాత్రం కాలేజీ భవనం కట్టాలని కోరా: సురేఖ



గిర్మాజీపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): తమ వద్దకు వచ్చే వివిధ కంపెనీల ఫైళ్లను క్లియర్ చేసేందుకు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారంటూ మంత్రి కొండా సురేఖ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వరంగల్‌లోని కృష్ణ కాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమంలో గురువారం ఆమె మాట్లాడారు. "ఎంతో మంది బాలికలకు ఉన్నత విద్య అందిస్తున్న కాలేజీ తరగతి గదులు వర్షాకాలంలో జలమయమవుతున్నాయి. విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. పాతది కూలగొట్టి, కొత్త భవనం కట్టాలని కలెక్టర్ కూడా నా దృష్టికి తెచ్చారు. ఇందుకు రూ.4.5 కోట్లు ఎక్కడి నుంచి తేవాలో దారీతెన్ను తెలియలేదు. మరి నేను అటవీ శాఖ మంత్రిగా ఉన్నాను కాబట్టి.. నా దగ్గరకు కొన్ని కంపెనీల ఫైళ్లు క్లియరెన్స్ కోసం వస్తాయి. మామూలుగా అలాంటి ఫైళ్లు వచ్చినప్పుడు మంత్రులు డబ్బులు తీసుకుని క్లియర్ చేస్తారు. అప్పుడు వాళ్లతో నేను అన్నా.. మాకు ఒక్క నయాపైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. మీరు సమాజ సేవ చేయండి. మా స్కూల్ ఒకటి డెవలప్ చేయండి. మీ పేరు గుర్తుండి పోతుందని చెప్పా. అప్పుడు మా చేతుల్లో లేదు.. పై వాళ్లతో మాట్లాడతామని అరబిందో ఫార్మాకు చెందిన సదానంద రెడ్డి చెప్పారు. చివరకు సీఎస్ఆర్ నిధులు రూ.4.5 కోట్లతో కాలేజీ భవనం కడతామని చెప్పినప్పుడు నాకు సంతోషం కలిగింది" అని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. ఆ నిధులతో గ్రౌండ్, రెండంతస్థులతో 15 తరగతి గదులు, ఆడిటోరియం తరహాలో పెద్ద హాల్, 60 అధునాతన టాయిలెట్లు, నూతన ఫర్నిచర్ విద్యార్థినులకు అందుబాటులోకి రానుందని తెలిపారు.

కర్ణాటక తరహా లైసెన్స్‌డ్ సర్వేయర్లు

» తొలిదశలో 5 వేల మంది నియామకం: పొంగులేటి

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా గ్రామ స్థాయిలో లైసెన్స్ సర్వేయర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కర్ణాటకలో విజయవంతమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిదశలో 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని, ఇందుకోసం ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులకు సర్వే అకాడమీలో 50 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కర్ణాటకలో అమలవుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానంపై ఇటీవల సర్వే విభాగానికి సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు.

ప్రకృతి విధ్వంసానికి సీఎందే బాధ్యత: కేటీఆర్

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ప్రకృతి విధ్వంసం, రూ.10 వేల కోట్ల అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై గురువారం విచారణ సందర్భంగా అధికారులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రేవంత్ రెడ్డి మూర్ఖత్వంతో అధికారులు జైలు శిక్ష అనుభవించే పరిస్థితి నెలకొందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రేవంత్‌రెడ్డి తప్పులను ఒప్పుకుని, అక్కడ బుల్డోజర్లతో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలని, లేదంటే ఆయనకూ కోర్టు శిక్షలు తప్పవన్నారు.

చెట్లు నరకడంలో ఆంతర్యమేంటి!?

(మొదటిపేజీ తరువాయి)

పునరుద్ధరిస్తారో లేదో చెప్పాలని నిలదీసింది. లేకపోతే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సహా బాధ్యులైన అధికారులందరూ అక్కడే తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళతారని పునరుద్ఘాటించింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో రాష్ట్ర ప్రభుత్వం చెట్లు కొట్టేసిన అంశాన్ని ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలో జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది. తొలుత.. తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు గత ఆదేశాలను అనుసరించి కంచె గచ్చిబౌలిలో పనులన్నీ ఆపేశామని, వైల్డ్ లైఫ్ సంరక్షణ చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. సీఈసీ నివేదిక బుధవారం రాత్రే తమకు అందిందని, దానికి బదులిచ్చేందుకు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు.



పునరుద్ధరిస్తారా!? జైలుకు పంపుతారా!?

బుల్డోజర్లతో చదును చేసిన శాటిలైట్ ఫొటోలను సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ)కి ఫారెస్ట్ సర్వీస్ ఆఫ్ ఇండియా సమర్పించిందని, అక్కడ కేవలం రెండు రాత్రుల్లోనే 104 ఎకరాలకుపైగా చదును చేశారని అమికస్ క్యూరీ పరమేశ్వర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందులో 60 శాతం మోస్తరు, దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దీంతో, చెట్ల నరికివేతకు పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? అని సీజేఐ బీఆర్ గవాయి ప్రశ్నించారు. చెట్ల ఎత్తు ఆధారంగా సెల్ఫ్ సర్టిఫికెట్ తీసుకున్నామని సింఘ్వీ బదులిచ్చారు. సెల్ఫ్ సర్టిఫికెట్ కాదని, ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ (ఈసీ) తీసుకున్నారా? అని సీజేఐ మరోసారి ప్రశ్నించారు. కేవలం 50 హెక్టార్లకుపైగా ఉంటేనే ఈసీ క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంటుందని సింఘ్వీ తెలిపారు. అయితే, "అక్కడ అటవీ ప్రాంతంలోని చెట్లను నరికేసినట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది. కంచ గచ్చిబౌలిలో పర్యావరణాన్ని పునరుద్ధరించకపోతే జైలుకు వెళ్లాల్సిందే. ఈ అంశంలో అధికారులను సమర్థించే ప్రయత్నం చేయకండి. చెట్ల నరికివేతలో ప్రధాన కార్యదర్శి సహా ఇతర అధికారుల ప్రమేయం ఉందని తెలుస్తోంది. లాంగ్ వీకెండ్‌ను ఆసరాగా చేసుకుని.. న్యాయస్థానాలకు సెలవు రోజులని తెలిసి అంత పెద్ద మొత్తంలో చెట్లను నరికేస్తారా? డజన్ల కొద్దీ బుల్డోజర్లు తీసుకొచ్చి విధ్వంసం చేస్తారా? వారాంతంలో చెట్లు నరకడంలో ఆంతర్యం ఏమిటి? సుస్థిర అభివృద్ధికి మేమేమీ వ్యతిరేకం కాదు. మిస్టర్ సింఘ్వీ.. మీరసలు బుల్డోజర్ల ఫొటోలు చూశారా? ఇది పూర్తిగా ముందస్తు ప్రణాళికతోనే జరిగినట్టు కనిపిస్తోంది. కోర్టు ధిక్కరణ నుంచి అధికారులను కాపాడుకోవాలని చూడొద్దు. ప్రభుత్వం ముందు రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. అడవిని పునరుద్ధరిస్తారో? లేదా అక్కడే నిర్మించే తాత్కాలిక జైలుకు సీఎస్ సహా అధికారులను పంపుతారో నిర్ణయించుకోండి" అని సీజేఐ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటుతున్నాం: సింఘ్వీ

ఇప్పటికే అడవి పునరుద్ధరణ చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగా మొక్కలు నాటుతున్నామని ధర్మాసనానికి అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. ఈ మేరకు ఫొటోలతో కూడిన పూర్తి నివేదికను కోర్టుకు అందజేస్తామని వివరించారు. అయితే, చెట్లు నరికేసిన స్థలంలోనే మొక్కలు నాటుతున్నారా? అని సీజేఐ ప్రశ్నించారు. అయితే, అక్కడ కాకుండా మరోచోట మొక్కలు నాటుతున్నారని ప్రతివాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సింఘ్వీ అభ్యంతరం తెలిపారు. అయితే, వాదనల్లోకి వెళ్లేందుకు కోర్టు నిరాకరించింది. అక్కడ అడవిని పునరుద్ధరిస్తున్నారా? లేదా? అనేదే తమకు ముఖ్యమని స్పష్టం చేసింది. సింఘ్వీ తన వాదనలు కొనసాగిస్తూ.. ఆ స్థలంలో ఎలాంటి అభివృద్ధి చేయాలనే అంశంపై సుమారు ఏడాదిగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. అంతేతప్ప ఇది కేవలం వారాంతంలో తీసుకున్న నిర్ణయమేమీ కాదని స్పష్టం చేశారు. అయితే, చెట్ల నరికివేతను సోమవారం ఎందుకు ప్రారంభించలేదని సీజేఐ ప్రశ్నించారు. దాంతో, తమ తదుపరి నివేదికలో అన్నింటికీ స్పష్టతనిస్తామని సింఘ్వీ బదులిచ్చారు. కాగా, సీఈసీ నివేదికకు కౌంటర్ దాఖలు చేయడానికి ఎంత సమయం కావాలని సీజేఐ ప్రశ్నించగా.. జూలై వరకు సమయం ఇవ్వాలని సింఘ్వీ కోరారు. దీనికి సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి అభ్యంతరం తెలిపారు.

అలాంటి ప్రణాళికేదీ లేదు: నిరంజన్ రెడ్డి

అడవి పునరుద్ధరణకు ప్రభుత్వం వద్ద ప్రణాళికేదీ లేదని ఇంప్లీడ్ పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు రాబోయే వర్షాకాలం సరైనదని, హైదరాబాద్‌లో మాన్ సూన్ సీజన్ జూన్ 10 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ నిర్మాణాల కోసం ఆలోచన చేస్తోందని, కానీ, పునరుద్ధరణ చర్యలేమీ తీసుకోవడం లేదని తెలిపారు. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే జూలై వరకు వాయిదా కోరుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం ఇటీవల సమర్పించిన నివేదికలోని అంశాలను ప్రస్తావించేందుకు సింఘ్వీ ప్రయత్నించగా, సీజేఐ అడ్డుకున్నారు. చెట్ల నరికివేత ప్రదేశంలో జింకలు, నెమళ్లు స్పష్టంగా ఉన్నాయని, మళ్లీ దానిని కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు ఎందుకని ప్రశ్నించారు.

3 పాఠశాలలను కూల్చివేశారు: వరుణ్ ఠాకూర్

కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేత సమయంలో విజిల్ బ్లోయర్లు, విద్యార్థులపై కేసులు నమోదు చేశారని సీనియర్ న్యాయవాది వరుణ్ ఠాకూర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 200 మంది విద్యార్థులపై క్రిమినల్ కేసులు పెట్టారని, ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయని, పరీక్షలు రాయాల్సిన కొందరు విద్యార్థులు జైళ్లలో ఉన్నారని తెలిపారు. విద్యార్థులపై కేసులు కొట్టేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యా సంవత్సరం మధ్యలోనే మూడు పాఠశాలలను కూల్చివేశారని చెప్పారు. దీనిపై సీజేఐ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఈ కేసును గతంలోనూ (సీజేఐ కాకముందు) నేనే విచారించాను. ఇప్పటి వరకూ స్కూళ్ల కూల్చివేత ఆరోపణలు రాలేదు. అక్కడికి వెళ్లి పరిశీలించిన అనేక కమిటీలు కూడా తమ నివేదికల్లో ఈ అంశాన్ని ప్రస్తావించలేదు" అని వ్యాఖ్యానించారు. తాము కూడా మొదటిసారిగా ఈ ఆరోపణలు వింటున్నామని సింఘ్వీ తెలిపారు. అయితే, సుమోటో కేసుతో కలిపి దీనిని (ఐఏ) విచారించడం కుదరదని, కావాలంటే, మరో పిటిషన్ దాఖలు చేసుకోవాలని సీజేఐ సూచించారు. కాగా, ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున మోహిత్ రావు వాదనలు వినిపిస్తూ.. అక్కడ జరిగిన విధ్వంసానికి సంబంధించి తాము స్పష్టమైన ఫొటోలతో కూడిన ఆధారాలు సమర్పించామని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో, అన్ని పిటిషన్లను సుమోటోతో కలపవద్దని సీజేఐ తెలిపారు. తమ పిటిషన్ మొదటి నుంచీ ఉన్నదేనని, మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకొస్తున్నానని మోహిత్ రావు స్పష్టం చేశారు. తమ పిటిషన్‌లో బుల్డోజర్లతో చదును, అడవిని నిర్మూలించే, జంతువులు, పక్షులు అక్కడ నివాసం ఉండే ఆధారాలతో కూడిన చిత్రాలు జత చేశామని తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. దాంతో, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌లోనే అన్నిటినీ పొందుపరిచామని సింఘ్వీ బదులిచ్చారు. అలాగయితే.. ఆ కాపీని మోహిత్ రావుకు అందజేయాలని సీజేఐ ఆదేశించారు. తదుపరి విచారణను జూలై 23కు వాయిదా వేశారు.

అటవీ ప్రాంతంగా కంచ గచ్చబౌలి భూములు

» నిర్వహణను అటవీ శాఖకు అప్పగించాలి

» సుప్రీం కోర్టుకు సీఈసీ తుది నివేదిక

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చబౌలి భూములను అటవీ ప్రాంతంగా ప్రకటించాలని కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సిఫారసు చేసింది. ఆ భూముల నిర్వహణను అటవీ శాఖకు అప్పగించాలని కోరింది. అలాగే, అక్కడున్న జీవ వైవిధ్యం దృష్ట్యా ఆ భూములను వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 కిందకు తెచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించింది. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి సీఈసీ ఏప్రిల్‌లో మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయ తెలిసిందే. తాజాగా తుది నివేదికను సుప్రీం కోర్టుకు తాజాగా సమర్పించింది. ఇందులో అనేక కీలకమైన సిఫారసులు చేసింది. "ఆ ప్రాంతంలో కొట్టేసిన చెట్ల స్థానంలో మళ్లీ మొక్కలు నాటి దట్టమైన పచ్చదనం పెంపొందించేలా చేయాలి. వచ్చే వర్షాకాలంలోనే ఈ పని చేపట్టాలి. భూసార, జల సంరక్షణ కార్యక్రమాలను కూడా చేపట్టాలి. అక్కడి జల వనరులన్నింటినీ వెట్ ల్యాండ్స్ సంరక్షణ, నిర్వహణ నిబంధనలు-2017 ప్రకారం సంరక్షించాలి. జీహెచ్ఎంసీ ఆ ప్రాంతంలో సరైన మురుగునీటి శుద్ధి ప్లాంట్లను వచ్చే ఏడాది కాలంలో ఏర్పాటు చేయాలి" అని సూచించింది. ఇక, రాష్ట్రంలోని అటవీ భూములను గుర్తించడానికి నిపుణుల కమిటీని రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించాలని, ఆ కమిటీలో క్షేత్రస్థాయి అటవీ అధికారులు, వన్యప్రాణి నిపుణులు, జీవావరణవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే ఏజెన్సీలు ఉండాలని పేర్కొంది. కోర్టు ఆదేశాల ప్రకారం అటవీ ప్రాంతాల్లా ఉన్నవాటిని ఈ కమిటీ గుర్తించాలని, ప్రైవేటు భూముల కంటే ప్రభుత్వ భూములను అటవీ ప్రాంతాలుగా గుర్తించే విషయంలో కమిటీ మరింత కఠినంగా ఉండాలని సిఫారసు చేసింది. రాజ్యాంగంలోని 48ఏ, 21 ప్రకరణల ప్రకారం ప్రభుత్వంపై సదరు బాధ్యత ఉంటుందని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో అటవీ భూముల్లాంటివి ఎక్కువగానే ఉంటాయని, పట్టణ ప్రాంతాల్లో అక్కడక్కడా మాత్రమే ఉంటాయని, డీమ్డ్ ఫారెస్ట్‌గా ఏ భూమిని గుర్తించాలన్న విషయంపై నిపుణుల కమిటీ ఈ వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలని తెలిపింది. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీని వేయాలని సిఫారసు చేసింది. ఇందులో పీసీసీఎఫ్, సీసీఎల్ఏ, న్యాయ నిపుణులు, పర్యావరణవేత్తలు ఉండాలని సూచించింది. ప్రభుత్వ, సంస్థలకు చెందిన భూములను అటవీ ప్రాంతాలుగా గుర్తించేందుకు ఎలాంటి పద్ధతి అనుసరించాలన్న దానిపై ఈ కమిటీ పని చేయాలని సిఫారసు చేసింది. అలాగే, సుప్రీం కోర్టు ఆదేశాలను కూడా నెరవేర్చేలా ఈ కమిటీ పర్యవేక్షించాలని సూచించింది. సీఈసీ సూచనల మేరకు కంచ గచ్చబౌలిలో తొలగించిన చెట్ల పరిమాణాన్ని నిర్ధారించేందుకు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు అయిన రూ.14.52 లక్షల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించాలని, ఆ మొత్తాన్ని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు చెల్లించాలని సూచించింది.

రాష్ట్రంలో పారదర్శక పాలన



పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనతో పారదర్శకంగా పథకాలు అమలుచేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గ్రామాలు, తండాల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పారు. కడ్తాల మండలం మైసిగండిలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో చేపట్టే తాగు నీటి పైపులైన్ పనులకు గురువారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జవహర్‌లాల్‌లతో కలిసి భూమి పూజచేశారు. తండా వాసుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట్ల మిషన్ భగీరథ అదనపు పైపులైన్లు, ట్యాంక్‌లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఇందిర గిరి సౌరజల వికాసం పథకం కింద ఎస్టీల భూముల్లో వంద శాతం సబ్సిడీతో బోర్లు, సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేయించేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. యువత ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం స్కీం కింద అర్హులకు ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు రుణాలిస్తున్నట్టు ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు. మైసిగండి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ నరేశ్, నాయకులు బిచ్యానాయక్, జగన్, హీరాసింగ్, అనిల్, తులసీరామ్, చందోజీ, కిషన్, ఫరీద్, ప్రేమ, లక్ష్మి, శారద, కవిత పాల్గొన్నారు.

'ధారూరును భూ సమస్యల్లేని మండలంగా చేద్దాం'

ధారూరు, మే 15(ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ధారూరు మండలాన్ని భూ సమస్యల్లేని మండలంగా చేద్దామని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. అంతారంలో గురువారం నిర్వహించిన భూ భారతి సదస్సులో ఆయన మాట్లాడారు. అధికారులు గ్రామాలకొచ్చి రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తున్నారని చెప్పారు. రైతుల భూసమస్యలను పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. రైతుల దరఖాస్తులను పరిశీలించారు. గ్రామంలో 59 దరఖాస్తులు, మోమిన్‌కలాన్‌లో 22, మోమిన్‌కుర్దులో 31, అంతారంలో 6 దరఖాస్తులు వచ్చాయని రెవిన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సాజిదా బేగం, శ్రీనివాస్, దీపక్, శ్యాంసన్, డీటీ విజయేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా నాగారం, రాజాపూర్, కొండాపూర్‌కుర్దుల్లో శుక్రవారం రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

సీసీఐ కాలుష్యంపై లోకాయుక్త విచారణ

తాండూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారం నుంచి వెలువడుతున్న కాలుష్యంపై కొందరు రైతులు 2016లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. సీసీఐ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో పంటలు పండడం లేదని, ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని, నీరు కలుషితమవుతోందని మాజీ ఉప సర్పంచ్ హేమంత్, రైతులు రామప్ప, గోపాల్, కాలప్ప, సమ్మప్ప, దస్తప్ప తదితర 20 మంది అప్పట్లో ఫిర్యాదు చేశారు. 2011లో అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో 2016లో కాలుష్య నియంత్రణ అధికారులు కర్మాగారాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. గురువారం లోకాయుక్త అధికారులు డైరెక్టర్ వెంకట్‌రావు, అడిషనల్ ఎస్పీ ఇస్మాయిల్ వచ్చారు. తహసీల్దార్ తారాసింగ్, ఏవో కొమరయ్య, ఉద్యానవన, మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులతో కర్మాగార పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సిద్ధార్థను వివరాలడిగి తెలుసుకున్నారు.

తప్పుల తడక!

(ఐదో పేజీ తరువాయి)

తరువాత అత్యంత ఎక్కువ జనాభా ఉన్న జిల్లాలు రంగారెడ్డి, మేడ్చల్‌లు అనే విషయం అందరికీ తెలిసిందే. సాధారణంగా ఈ రెండు జిల్లాల్లో ఉన్న అధిక జనాభా రీత్య జనన, మరణాలూ ఎక్కువగానే ఉంటాయి. కానీ సీఆర్ఎస్ నివేదికలో వికారాబాద్ జిల్లా కంటే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో జనన, మరణాలు తక్కువగా నమోదయ్యాయి. అది కూడా కొవిడ్ సమయంలో కావడం గమనార్హం. అలాగే పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో జనన, మరణాలు అధికంగా ఉన్నాయి. ఇలా ఏ రకంగా చూసినా సీఆర్ఎస్ నివేదికలో వివరాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. అలాగే రంగారెడ్డి జిల్లా పేరును శంషాబాద్- రంగారెడ్డి జిల్లాగా నివేదికలో పేర్కొనడం గమనార్హం. కొత్త జిల్లాలు ఏర్పాటై దాదాపు తొమ్మిదేళ్లు గడిచినా కూడా జిల్లాల పేర్లపై ఇంకా అయోమయం కొనసాగించడం విశేషం. వికారాబాద్ జిల్లాలో 22,221 జననాలు ఉన్నాయని, రంగారెడ్డి జిల్లాలో ఆ సంఖ్య 8,495 గానే పేర్కొన్నారు. ఇదే సమయంలో పక్కనే ఉన్న మేడ్చల్‌లో 35,424 జననాలు నమోదయ్యాయి.



అలాగే మరణాల విషయంలోనూ గందరగోళంగానే వివరాలు ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో 7,112 మంది మరణించగా... మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అంతకంటే తక్కువగా నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లాలో 4,421 మరణాలు, రంగారెడ్డి జిల్లాలో 6,450 మరణాలు నమోదయ్యాయి. కొవిడ్ సమయంలో సాధారణం కంటే మరణాలు ఎక్కువ నమోదైన సంగతి తెలిసిందే. కానీ సీఆర్ఎస్ నివేదికల్లో పేర్కొన్న వివరాలకు వాస్తవ పరిస్థితులకు ఏ మాత్రం సంబంధం కూడా లేనట్లుగా కనిపిస్తోంది. ఇక రంగారెడ్డి జిల్లాలో శిశు మరణాలు, వికారాబాద్‌లో ప్రసవ సమయంలో శిశు మరణాలు సున్నాగా నమోదయ్యాయి. పుట్టిన తరువాత 48 రోజుల్లో మరణిస్తే శిశుమరణాల కింద లెక్కిస్తారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో ప్రసవ సమయంలో మరణాలు అధికంగా ఉన్నాయి. సీఆర్ఎస్ నివేదిక ప్రకారం రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో 2021లో జనన మరణాల వివరాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారీగా ఇలా ఉన్నాయి.

శిశు మరణాలు

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
రంగారెడ్డి	0	0	0
మేడ్చల్	13	10	23
వికారాబాద్	1	0	1

ప్రసవ సమయంలో శిశు మరణాలు

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
రంగారెడ్డి	39	35	74
మేడ్చల్	13	10	23
వికారాబాద్	0	0	0

ప్రాంతాల వారీగా జననాలు

	గ్రామీణ			పట్టణ		
జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం	పురుషులు	మహిళలు	మొత్తం
రంగారెడ్డి	1,691	1,642	3,333	2,727	2,435	5,162
మేడ్చల్	3,161	2,934	6,095	15,232	14,097	29,329
వికారాబాద్	7,163	6,578	13,741	4,330	4,140	8,470

ప్రాంతాల వారీగా మరణాలు

	గ్రామీణ			పట్టణ		
జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం	పురుషులు	మహిళలు	మొత్తం
రంగారెడ్డి	1,719	1,537	3,256	2,044	1,150	3,194
మేడ్చల్	542	454	996	1,967	1,458	3,425
వికారాబాద్	3,476	2,491	5,967	694	451	1,145

ప్రాంతాల వారీగా శిశు మరణాలు

	గ్రామీణ			పట్టణ		
జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం	పురుషులు	మహిళలు	మొత్తం
రంగారెడ్డి	0	0	0	0	0	0
మేడ్చల్	8	7	15	5	3	8
వికారాబాద్	0	0	0	1	0	1

ప్రాంతాల వారీగా ప్రసవ శిశు మరణాలు

	గ్రామీణ			పట్టణ		
జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం	పురుషులు	మహిళలు	మొత్తం
రంగారెడ్డి	0	0	0	39	35	74
మేడ్చల్	28	25	53	37	24	61
వికారాబాద్	0	0	0	0	0	0

అందాలభామల కోసం 'ఎకో పార్కు'లో ఏర్పాట్లు

(ఐదో పేజీ తరువాయి)

ఎక్స్‌పీరియం ఎకో- ఫ్రెండ్లీ పార్కు ఏర్పాటు చేశారు. 150 ఎకరాల ఈ పార్కులో 85 దేశాల నుంచి తెచ్చిన వివిధ రకాల మొక్కలు, వృక్షాలు, అందమైన శిల్ప కళ అబ్బుర పరుస్తున్నాయి. వీటిని తిలకించడానికి అందాల ముద్దుగుమ్మలు రానున్నారు. వారికి డోలు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికేందుకు పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్కులోని బాంబోగార్డెన్, బుద్ధ గార్డెన్, కల్ప వృక్షాలు, జపనీస్ గార్డెన్‌ల అందాలను సుందరాంగులు వీక్షించనున్నారు. త్రీస్టోన్ ఏరియాలో తారలకు పార్కు నిర్వాహకులు తేనీటి విందును ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా సుందరీమణులు పార్కులో ఒక్కో మొక్కను నాటనున్నారు. అందాలభామల పర్యటనలో భాగంగా అక్కడ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా పిల్లలమర్రికి వెళ్లనున్నారు.



ఎకో పార్కులో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

భారీ బందోబస్తు..

ఎక్స్‌పీరియం ఎకో-ఫ్రెండ్లీ పార్కుకు ప్రపంచ సుందరీమణులు రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏసీపీ రమణగౌడ్, మోకిల, శంకర్‌పల్లి సీఐలు వీరబాబు, శ్రీనివాస్. డిటెక్టివ్ సీఐ సమరంరెడ్డిలతో పాటుగా సుమారు 100 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ఇప్పటికే మూడు రోజుల నుంచి డాగ్ స్క్వాడ్‌తో పార్కులోని అణువణువును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పాసులు ఉన్నవారికే మాత్రమే పోలీసులు లోపలికి అనుమతించనున్నారు. అయితే నేడు (శుక్రవారం) రోజున పార్కును సందర్శించేందుకు సాధారణ విజిటర్స్‌కు అనుమతి లేదని నిర్వాహకులు తెలిపారు.



ఉమామహేశ్వరుల కల్యాణాన్ని జరిపిస్తున్న భక్తులు

ముగిసిన వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తాండూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారెడ్డిపల్లిలో గల పురాతన వీరభద్రేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. రెండు రోజులు బ్రహ్మోత్సవాలు జరిగాయి. గురువారం తెల్లవారు జామున రుద్రాభిషేకం, స్వామివారి పల్లకిసేవ, అనంతరం అగ్నిగుండ ప్రవేశం, ఉదయం 11:21గంటలకు ఉమామహేశ్వరుల పరిణయోత్సవాలను నిర్వహించారు. అర్చకుడు జగదీశ్వరస్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలను జరిపించారు. వధూవరుల పెళ్లిపెద్దలుగా పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, యశోద, గట్టు విజయ్‌కుమార్, విజయలక్ష్మి దంపతులు బాధ్యత వహించారు. అర్చకుడు శివకుమార్‌స్వామి కల్యాణం జరిపించారు. రాత్రి ఆలయ ప్రాంగణం నుంచి కొద్ది దూరం వరకు భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బెల్కటూర్, అల్లాపూర్, రాంపూర్, వీరారెడ్డిపల్లి, మిట్టబాస్పల్లి గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలించ్చి పూజల్లో పాల్గొన్నారు.

2.24 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం



- కడ్తాల్ ఎంపీడీవో సుజాత

ఫేస్ టు ఫేస్

కడ్తాల్, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమం విజయవంతానికి కడ్తాల మండలంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, నిర్దేశిత లక్ష్యాల పూర్తికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని ఎంపీడీవో సుజాత తెలిపారు. ఈమేరకు ఆమె 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న : వనమహోత్సవంలో భాగంగా ఈ ఏడాది ఎన్ని మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్ణయించారు?

జవాబు : మండల పరిధిలోని 24 పంచాయతీల్లో 2.40 లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించి ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ఒక నర్సరీని ఏర్పాటు చేశాం. ప్రతీ పంచాయతీ పరిధిలో 10వేల మొక్కలు నాటుతాం.

ప్ర : మొక్కలు ఎప్పటి నుంచి నాటుతారు?

జవాబు : జూన్‌లో వర్షాలు పడిన వెంటనే మొక్కలు నాటడానికి వీలుగా గ్రామ పంచాయతీల వారిగా స్థలాల గుర్తింపు ఇప్పటికే ప్రారంభించాం.

ప్రశ్న : నర్సరీలలో ఏయే మొక్కలు పెంచుతున్నారు?

జవాబు : నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నాం. ఈ ఏడాది రైతులకు ప్రతి గ్రామ పంచాయతీకి రెండు వేల చొప్పున టేకు మొక్కలు అందజేయడానికి 48 వేల మొక్కలు సిద్ధం చేశాం.

ప్రశ్న : ఈజీఎస్ జాబ్ కార్డులు ఎంత మందికి ఇచ్చారు? ఉపాధిహామీ పథకంలో భాగంగా ఏయే పనులు చేపడుతున్నారు?

జవాబు : మండల పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 8,420 మందికి ఈజీఎస్ జాబ్ కార్డులు ఉన్నాయి. అయితే, అందులో ప్రస్తుతం 300మంది పనులకు హాజరవుతున్నారు. ఫాంపొండ్‌లు, కాంటూరు కందకాలతో పాటు సర్క్యులేషన్ ట్యాంక్‌ల పనులు కొనసాగుతున్నాయి.

ప్రశ్న : మండలానికి ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని కేటాయించారు?

జవాబు : 24 గ్రామ పంచాయతీల పరిధిలో 590 ఇళ్లు టార్గెట్‌గా నిర్ణయించి ఇప్పటివరకు 93 మందికి మంజూరు చేశాం. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన కొండ్రిగానిబోడు తండాలో 26 ఇళ్లు మంజూరు చేయగా 8 మంది బేస్‌మెంట్లు పూర్తిచేయగా బిల్లులు అందజేశాం.

నిరుపయోగంగా షాదీఖానా

- ఒకప్పుడు జోరుగా ఫంక్షన్లు.. నేడు పట్టించుకునేవారు కరువు
- నిర్వహణ లేక శిథిలావస్థకు..



చెరువు కట్ట కింద నిర్వహణకు దూరంగా ఉన్న ముస్లిం మైనారిటీ షాదీఖానా

ఇబ్రహీంపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద ముస్లిం మైనారిటీ షాదీఖానా నిర్వహణలేక శిథిలావస్థకు చేరుకుంది. కాంపౌండ్‌లో ఏపుగా చెట్లు పెరిగి చెత్తాచెదారంతో కనీసం కాలు పెట్టలేకుండా ఉంది. అదేవిధంగా నిర్జన ప్రదేశం కావడంతో పాములు తిరగాడుతున్నాయి. 2003లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో సుమారు రూ.50 లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. రణగొణ ధ్వనులకు దూరంగా.. పైన చెరువు కట్ట, పడమర వైపు ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లే విశాలమైన రోడ్లు ఉన్నాయి. మైనారిటీ సంక్షేమ శాఖ అధీనంలో ఉన్న షాదీఖానాలో అప్పట్లో పెళ్లిళ్లు, పుట్టినరోజు వేడుకలు, చిన్న చిన్న దావత్‌లు బాగా జరిగేవి. ముస్లింలే గాకుండా ఇతర వర్గాల వారు కూడా నిర్వహణకోసం చిన్న మొత్తంలో డబ్బు చెల్లించి ఇందులో ఫంక్షన్లు చేసుకునేవారు. ఈక్రమంలో షాదీఖానా నిర్వహణను పూర్తిగా మరిచిపోయారు. అటువైపు కనీసం కన్నెత్తి చూడలేకపోతున్నారు. దీంతో పరిసరాల్లో చెట్లు ఏపుగా పెరిగి భవనం పూర్తిగా దుమ్ము కొట్టుకుపోయింది. అధికార యంత్రాంగం కూడా దీన్ని మరిచిపోయినట్లుంది. ఈ షాదీఖానాకు పైనే ఇబ్రహీంపట్నం పాషా దర్గా ఉంది. అందరికీ అందుబాటులో మంచి వాతావరణంలో ఈ భవనాన్ని తిరిగి నిర్వహణలోకి తెస్తే గనుక పేద, మధ్య తరగతి వర్గాలు ఫంక్షన్లు చేసుకునే అవకాశం ఉంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భవనాన్ని వినియోగంలోకి తేవాలి



రూ.లక్షలు వెచ్చించి అప్పట్లోనే షాదీఖానాను చక్కగా నిర్మించారు. పేద, మధ్య తరగతి వాళ్ల పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లు జరుపుకోవడానికి అనుకూలంగా ఉంది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ జనానికి అందుబాటులో ఉన్న షాదీఖానాను నిర్వహణలోకి తెస్తే బయట ఫంక్షన్‌హాళ్లకు పెద్ద మొత్తంలో చెల్లించుకోలేనివారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

- ఎండీ గౌస్, ఇబ్రహీంపట్నం

ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు చూపాలి

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం కందుకూరు, యాచారం మండలాల్లో ఫార్మసిటీ కోసం వేల ఎకరాలను సేకరించి, భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి గుంట ఇంటి స్థలం ఇస్తున్నట్లు ప్రకటించి 9 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వారికి స్థలం చూపకపోవడం విడ్డూరంగా ఉందని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ అన్నారు. గురువారం ఆయన మండలం కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఫార్మసిటీ పేరుతో రెండు మండలాల్లో పది వేల ఎకరాలకు పైగా భూములను సేకరించారని, గత ప్రభుత్వ హయాంలోనే వెంచర్‌ను అభివృద్ధి చేపట్టి ఎకరం భూమి కోల్పోయిన రైతులకు గుంట(121 గజాలు) ఇంటి స్థలానికి సంబంధించిన పత్రాలను ఇచ్చారన్నారు. నేటికీ ఇంటి స్థలాలు చూపలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదైనా వెంచర్‌ను అభివృద్ధి చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రెండు మండలాల్లోని బేగరికంచ, మీర్కాన్‌పేట, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి, ఉట్లపల్లి, యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తదితర గ్రామాల రైతులకు ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగా కబ్జా చూపక పోవడంతో రైతులు అతి తక్కువ ధరలకు ప్లాట్లను అమ్ముకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంచర్‌ను అభివృద్ధి చేసి రైతులకు స్థలాలు చూపాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న భాస్కర్‌రెడ్డి, నాయకులు

ఆమనగల్లు, మే 15(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి కోరారు. అకాల వర్షాల నేపథ్యంలో విక్రయానికి తెచ్చిన ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌ను గురువారం భాస్కర్‌రెడ్డి సందర్శించారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డైరెక్టర్లతో కలిసి వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ఆందోళన చెందవద్దని చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. తూకాల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు మార్కెట్ పాలకవర్గం దృష్టికి తెచ్చారు. మ్యాచర్ వచ్చిన ధాన్యం కూడా తూకం వేయక వర్షానికి తడిసిందని రైతులు వాపోయారు. స్పందించిన భాస్కర్‌రెడ్డి కొనుగోళ్లు త్వరగా చేపట్టాలని సిబ్బందికి, అధికారులకు సూచించారు. డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, నరేశ్‌నాయక్, నాయకులు కృష్ణనాయక్, జగన్, ఫరీద్, శ్రీకాంత్, మహేశ్, బాబా, పర్వతాలు, మార్కెడ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్ అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి) షాద్‌నగర్ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా కో-ఆపరేటివ్ అధికారులు తనిఖీ చేశారు. డీసీవో సుధాకర్, డీఎస్వో వనజాతరెడ్డి వచ్చిన సమయంలో అక్కడ ఒక్క రైతూ కన్పించలేదు. కేంద్రం ఆవరణలో వడ్లు ఎండబోసిన రైతుల వద్దకు వెళ్లి సమస్యలపై అడిగారు. వర్షానికి చాలా మంది రైతుల ధాన్యం తడిసిందని, కొంత కొట్టుకుపోయిందని రైతులు చెప్పారు. రైతులు ధాన్యం ఎందుకు తేవడం లేదని కొనుగోలు కేంద్ర అధికారి షరీఫ్‌ను ప్రశ్నించారు. అయితే 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్నే కొనుగోలు చేయాలని, రైతులు ఎండబోయకుండా తెస్తున్న వడ్లలో 30 వరకు తేమ ఉంటోందని చెప్పారు. రైతుల్లో అవగాహన పెంచి మద్దతు ధరను పొందేలా చూడాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య యాదవ్

బీజేపీని బలోపేతం చేయాలి

ఇబ్రహీంపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీని బూత్ స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్య యాదవ్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలో బీజేపీ మండలాధ్యక్షుడు గోదల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి అత్యంత బాధాకరమైందని, ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్‌కు మోదీ నాయకత్వంలో మన సేనలు తగు రీతిలో బుద్ధి చెప్పాయన్నారు. రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మండల, మున్సిపల్ కార్యవర్గాలను విస్తరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుచుకునేందుకు తగిన కార్యాచరణతో ముందుకు పోవాలన్నారు. ప్రజల్లో బీజేపీకి మంచి ఆదరణ ఉందని.. రాబోయే రోజులు మనవేనని అన్నారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, అర్జున్‌రెడ్డి, దండె శ్రీశైలం యాదవ్, దొండ విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహగౌడ్, మొగిలి గణేష్, కె.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో నేడు మెగా మామిడి మేళా

చేవెళ్ల, మే 15(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో నేడు(శుక్రవారం) మెగా మామిడి మేళాను నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి కీర్తికృష్ణ ప్రకటనలో తెలిపారు. నేడు సంగారెడ్డిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా 200లకు పైగా మామిడి రకాల పండ్లను రైతుల సందర్శనార్థం ఉంచుతున్నారని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు ఫోన్ 89777-14222 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వాహనాల దారి మళ్లింపు

షాద్‌నగర్ రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో గురువారం నుంచి 20 వరకు జరుగుతున్న గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా గ్రామం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లించినట్లు గ్రామస్తులు తెలిపారు. అందుకు పోలీసుల అనుమతి తీసుకున్నట్లు వారు చెప్పారు. షాద్‌నగర్ నుంచి కొత్తపేటకు వెళ్లే వాహనాలు బాలాజీ పరిశ్రమ మీదుగా కొండన్నగూడ నుంచి వెలిజర్ల గ్రామం బయటి నుంచి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈమేరకు వాహనదారులు సహకరించాలని గ్రామస్తులు కోరారు.

'తెలంగాణ మహిళలతో కాళ్లు కడిగిస్తారా?'

చేవెళ్ల, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనే యువతుల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగిస్తారా? అని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గౌండ్ల కావ్యకృష్ణగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆమె ప్రకటనలో పేర్కొంటూ.. సుందరీమణుల కాళ్లను మన ఆడబిడ్డలతో కడిగించడం రాష్ట్ర ప్రజలకు, తెలంగాణకు అవమానమని.. ఇది మహిళలకు మాత్రమే కాకుండా తెలంగాణ సమాజానికి జరిగిన అవమానమని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

కేశంపేట, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తాండ్ర శ్రవణ్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో పశువైద్య ఉప కేంద్రంలో గురువారం లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా స్వప్న విధుల్లో చేరారు. ఈ సందర్భంగా శ్రవణ్ రెడ్డి స్వాగతం పలికారు. కేశంపేట మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, కొండారెడ్డిపల్లి, పాపిరెడ్డిగూడ గ్రామాలలోని పశువైద్య ఉప కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం సిబ్బందిని నియమించిందని శ్రవణ్ తెలిపారు. ఆయా గ్రామాల్లో పోస్టింగ్ పొందినవారు విధుల్లో చేరారని వివరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి చొరవతో గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సిబ్బందిని నియమించారని తెలిపారు. కేశంపేట పశు వైద్యాధికారి నివేదిత, మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు రాణి, నాయకులు రవీందర్, సత్యం గౌడ్, రామస్వామి, రామచందర్, భిక్షపతి, కృష్ణయ్య, శ్రీను, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో శ్రవణ్‌రెడ్డి, స్వప్న తదితరులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



యాచారం : కూలీలతో మాట్లాడుతున్న భూపాల్

యాచారం/శంషాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, మీ కష్టసుఖాల్లో సీపీఎం నిరంతరం పాలుపంచుకుంటుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. ఈమేరకు గురువారం మండల పరిధిలోని గున్‌గల్‌లో గల కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉపాధి, నిరుద్యోగం. అధిక ధరలు, ఆకలి కేకలున్నా పాలకులకు పట్టింపులేకుండా పోయిందన్నారు. కార్మికుల చేత 12 గంటల పాటు పనులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో పని చేస్తున్న కార్మికులకు నెలకు రూ.26వేల వేతనమందించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ఉపాధిహామీ పథకానికి వార్షిక బడ్జెట్‌లో కోత విధించడం సరైందికాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, జిల్లా అధ్యక్షురాలు అలివేలు, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎల్లేశ్ అన్నారు. గురువారం శంషాబాద్‌లో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పనికి తగిన వేతనం అందించాలన్నారు. సంఘం మండలాధ్యక్షుడు గణేశ్, నాయకులు సుధాకర్, వసంత, నీ లమ్మ, వెంకటమ్మ, మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

కూలీల సమస్యలు పరిష్కరించాలి



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న జగన్

ఆదిభట్ల, మే 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జగన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రాయపోల్, నెర్రపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గించి నీరుగారుస్తుందన్నారు. కూలీలకు నీటి సౌకర్యం, ప్రతీయేటా ఇవ్వాల్సిన గడ్డపార, తదితర పనిముట్లు ఇవ్వడం లేదని, రవాణా సౌకర్యం కల్పించడం లేదని, కూలీలకు వారం.. వారం ఇవ్వాల్సిన కూలి సరైన సమయంలో ఇవ్వడం లేదన్నారు. కూలీల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 30న తలపెట్టిన ధర్నా.. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి కూలీలందరూ పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కాకి రమేష్, నర్సింహ పాల్గొన్నారు.

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ ఆదర్శం



రైతులకు భోజనం వడ్డిస్తున్న యాట నర్సింహ

ఆమనగల్లు, మే 15(ఆంధ్రజ్యోతి): ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌ను గురువారం నర్సింహ సందర్శించారు. కొనుగోళ్ల వేగవంతం చేయాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ధాన్యాన్ని విక్రయానికి తెస్తున్న రైతుల సౌకర్యార్థం మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన శిబిరాన్ని సందర్శించి నాయకులతో కలిసి రైతులకు భోజనాన్ని వడ్డించారు. ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. అన్నదాతలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకనుగుణంగా రాష్ట్రప్రభుత్వం రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేసిందని తెలిపారు. విపక్షాలు విమర్శలు వీడి అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, మార్కెట్ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, తాళ్ల రవీందర్, నరేశ్‌నాయక్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.డీ ఫరీద్, నాయకులు మహేశ్, విజేందర్, ఎంగళి ప్రసాద్, పర్వతాలు, బాబా, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు ఆర్థిక సాయం

చేవెళ్ల, మే 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల పిడుగుపాటుకు చేవెళ్ల మండల పరిధిలోని పామెన గ్రామానికి చెందిన పట్నం సదానందంనకు చెందిన రెండు ఎద్దులు చనిపోయాయి. విషయం తెలుసుకున్న చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి గురువారం బాధిత రైతుకు తన వంతు సాయంగా రూ.5వేలు అందజేశారు. అలాగే మరికొందరు నాయకులు రైతు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎర్ర గోపాల్, గ్రామస్తులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి..



ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు

మంచాల, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరుట్లకు చెందిన ఆటోడ్రైవర్ ఆర్ల సత్తయ్య ఇటీవల గుండె పోటుతో మృతిచెందాడు. ఆయనకు భార్య, కూతురు, కుమారు డున్నారు. అకాల మరణం చెందిన స్నేహితుడు నిరుపేద కావడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు శ్రీ అయ్యప్ప డ్రైవర్ అ సోసియేషన్ సభ్యులు, స్నేహితులు ముందుకువచ్చి తలా ఇంత పోగుచేసి రూ.30వేలు సమకూర్చారు. గురువారం బాధిత కుటుంబసభ్యులకు డబ్బు అందజేశారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదాయిపల్లి గ్రామానికి చెందిన చందు ఇంటి నిర్మాణానికి తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. చందు ఇంటి నిర్మాణానికి చేయూతనందించాలని వెంకటేశ్‌ను అభ్యర్థించారు. స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చగా గురువారం స్థానిక నాయకులు, ట్రస్ట్ సభ్యులు అందజేశారు. సుధాకర్, శేఖర్, దశరథ్, మల్లేశ్, శ్రీశైలం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలు.. 200 రోజులు

- గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తుల ఆందోళన

తలకొండపల్లి, మే15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈమేరకు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు గురువారం 200వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి ప్రజలు పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్‌లు ఈ సందర్భంగా కోరారు.



దీక్షలో జేఏసీ నాయకులు తదితరులు

పేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్ల పథకం



భూమి పూజలో వెంకటేష్‌గౌడ్, ఇందిరా దశరథ

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు అండగా నిలుస్తుందని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని అన్నోజిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎన్టీఆర్ తండాలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ కాకి ఇందిరా దశరథతో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఎన్టీఆర్ తండాలో ముగ్గురు లబ్ధిదారులకు, అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి గ్రామాల్లో 13 మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్లకు మొదటి విడత కింద నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ఆదేశానుసారం తండాలో ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. నాయకులు డిల్లీ కృష్ణ, సుధాకర్, సవిత, శ్రీనివాస్, కార్యదర్శి పాల్గొన్నారు.

ఆధునిక సేద్యం లాభదాయకం



ఆమనగల్లు : సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆమనగల్లు/మాడ్గుల, మే 15(ఆంధ్రజ్యోతి): ఆధునిక సేద్యం రైతులకు అన్నివిధాలా లాభదాయకమని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.నిర్మల, డాక్టర్ ఎం.సుజాతలు అన్నారు. సాగులో రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ వ్యవసాయం ద్వారా పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. మండల పరిధిలోని కోనాపూర్‌లో గురువారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి ఏవో అరుణకుమారి అధ్యక్షతన రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విత్తనాల ఎంపిక, భూసార పరీక్షలు, చీడపీడల నివారణ, ఆరుతడి పంటలు సాగు, సేంద్రియ వ్యవసాయ విధానం తదితర విషయాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలన్నారు. ఏఈవో మీనాక్షి, రైతులు యాదయ్య, సాయిరెడ్డి, నర్సింహగౌడ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే అధునాతన వ్యవసాయ పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు తెలిపారు. మాడ్గుల మండలంలోని నాగిళ్ల రైతువేదికలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ మురళిలు రైతులకు వ్యవసాయ పద్ధతులను వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారులు జ్యోత్స్న, రాజేశ్, ప్రియాంక పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రాగి అంబలి పంపిణీ

కడ్తాల్, మే 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాగి అంబలి పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు 400 మందికి అంబలి పంపిణీ చేస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కేంద్రం కొనసాగుతోంది. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి పర్యవేక్షణలో పంపిణీ చేస్తున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఒడిషాలోని కుహనౌన్నా గ్రామానికి చెందిన భీమ్ మజ్హీ(38) శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి గ్రామానికి ఐదేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. జీవనోపాధి కోసం ఇటుక బట్టీల్లో కూలి పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 14న సాయంత్రం భీమ్ మజ్హీ అత్త మిహీలా మజ్హీతో కుటుంబ విషయాల్లో గొడవపడ్డారు. దాంతో మనస్తాపానికి గురైన భీమ్ మజ్హీ గురువారం ఇంట్లో టవల్‌తో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భార్య మమత ఉస్మానియాకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మజ్హీ మానసిక స్థితి బాగాలేదని, మృతిపై ఎవరిపైనా అనుమానంలేదని మమత పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.